RNI-TELTEL/2017/72695

31 జనవరి 2023

# శుభ తెలంగాణ

మంగళవారం | మేడ్చల్

ఎడిటర్: ఎస్ సీ శేఖర్

సంపుటి : 5, సంచిక :330

వెల: 4 రూ/.

Website:
www.subhatelangana.in

Published From Medchal, Circulated at Jagtial, Jangaon, Jayashankar, Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri, Bhuvanagiri.

## లీడర్లు పనిచేస్తలేరు..



హైదరాబాద్ :ప్రతి రాజకీయ పార్టీకి ఏదో ఒక సిద్ధాంతం ఉంటుందని.. దానికి అనుకూలంగానే పరిపాలన ఉంటుందని చినజీయర్ స్వామి అన్నారు. ఎన్నికల్లో ఎవరు గెలిచినా ప్రజల రక్షణ కోసమే పరిపాలన సాగిస్తారని చెప్పారు. ఏ రాజకీయ పార్టీ అయినా సరే ఎన్నికల తర్వాత రాజకీయాలు చేయడం ఆపేసి.. ప్రజా సం క్షేమం కోసం పనిచేస్తాయని.. కాని ప్రస్తుతం రాష్ట్రంలో అలాంటి వాతావరణం కనిపించడం లేదన్నారు. రాజకీయ పార్టీల నేతలు ప్రజల సమస్యలపై కాకుండా.. ఒకరిని ఒకరు దూషించుకోవడం పై ఎక్కువ ఫోకస్ పెడుతున్నారని చినజీయర్ చెప్పారు. కేవలం ప్రజా సంక్షేమం కోసమే అన్ని రాజకీయ పార్టీలు పనిచేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. సమతా స్ఫూర్తి కేంద్రానికి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా సమతా కుంభ్ పేరుతో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని చిన్న జీయర్ స్వామి తెలిపారు.

## కేసీఆర్ చిల్లర రాజకీయాలు చేస్తుండు



హైదరాబాద్(శుభ తెలంగాణ): కేసీఆర్ కుటుంబం తెలంగాణకు రాజు లెక్క వ్యవహరిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ ఆరోపించారు. రాష్ట్ర గవర్నర్?ను బద్నాం చేస్తున్నారని.. అసెంబ్లీ సమావేశాలకు గవర్నర్?ను పిలిస్తే కేసీఆర్?కు వచ్చిన ఇబ్బందేంటని ఆయన ప్రశ్నించారు. గవర్నర్ విషయంలో హైకోర్టు అనేకసార్లు మొట్టికాయలు వేసినా కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ అలాగే వ్యవహరిస్తోందని అన్నారు. అసెంబ్లీ సమావేశాలకు సమయం ఉన్నప్పటికీ..

వివరాలు 2లో..

## ఇంటర్ బోర్డులో రచ్చ

- ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు
- మధుసూదన్ రెడ్డిపై బోర్డు అధికారుల ఫిర్యాదు
- సీసీ కెమెరాల పాస్‌వర్డ్ మార్చినట్టు కేసు నమోదు
- బోర్డులో భద్రత వ్యవస్థ ట్యాంపరింగ్‌కు గురైంది
- ఇంటర్ బోర్డును ఓ అదృశ్య వ్యక్తి నడిపిస్తున్నాడు
- అధికారిని బెదిరించి పాస్‌వర్డ్‌ను తస్కరించారు: బోర్డు కార్యదర్శి
- ఆన్‌లైన్ వాల్యుయేషన్‌పై ముందుకేనని నవీన్ మిత్తల్ స్పష్టీకరణ
- టెండర్లపై మాట్లాడినందుకే కేసు: మధుసూదన్ రెడ్డి



హైదరాబాద్(శుభ తెలంగాణ): ఇంటర్ బోర్డులో మరో వివాదం తెరపైకి వచ్చింది. బోర్డు కార్యాలయంలో సీసీ కెమెరాల ట్యాంపరింగ్ జరిగిందంటూ అధికారులు ఆదివారం రాత్రి బేగంబజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డిపై ఈ మేరకు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాంప ల్లిలో ఉన్న బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్‌లోని

వివరాలు 2లో..

## లౌకికవాద పరిరక్షణకే జోడో

- దేశ ప్రజల కోసమే యాత్ర
- దేశ పునాదులను ధ్వంసం చేసే
- సిద్ధాంతానికి వ్యతిరేకంగా నిలబడాలి
- బీజేపీ నేతలు కశ్మీర్లో ఇలాంటి యాత్ర చేపట్టలేరు
- ఎందుకంటే వారికి భయం
- రాహుల్‌గాంధీ ధ్వజం
- శ్రీనగర్‌లో మంచువర్షంలోనే
- జోడో యాత్ర ముగింపు సభ
- పీసీసీ కార్యాలయంలో జాతీయ పతాకం ఆవిష్కరణ




శ్రీనగర్ (గోదావరి): 'భారత్ జోడో యాత్ర' చేపట్టింది తన కోసమో, కాంగ్రెస్ కోసమో కాదని ఆ పార్టీ అగ్ర నేత రాహుల్‌గాంధీ చెప్పారు. దేశ ప్రజల కోసం.. భారత లౌకికవాద, ఉదారవాద విలువల పరిరక్షణ కోసం కన్యాకుమారి నుంచి శ్రీనగర్ వరకు నడక సాగించానన్నారు. దేశ పునాదులను ధ్వంసం చేసే సిద్ధాంతానికి వ్యతిరేకంగా నిలబడడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆదివారమే ఈ యాత్ర పరిసమాప్తం కాగా.. సోమవారమిక్కడ ఎస్‌కే స్టేడియంలో భారీ మంచువర్షం నడుమే ముగింపు సభ నిర్వహించారు.

వివరాలు 2లో..

## ప్రాణాలైనా ఇచ్చేస్తా కానీ బీజేపీతో మళ్లీ చేతులు కలపను

### బీహార్ సీఎం నితీశ్ కుమార్

- ఆ పార్టీతో కలిసి నడిచేదేలేదని స్పష్టం చేసిన నితీశ్
- బీజేపీ ప్రస్తుత నాయకత్వం అహంకార పూరితంగా ఉందని విమర్శ
- గతేడాది ఎన్డీఏ నుంచి బయటకు వచ్చిన నితీశ్

వివరాలు 2లో..



## దిగొచ్చిన సర్కారు!

- హైకోర్టు సూచన మేరకు గవర్నర్ తమిళిసైతో రాజీ
- బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగానికి ఓకే
- గవర్నర్ కార్యాలయంతో ప్రభుత్వ చర్చలు ఫలప్రదం
- రాజీతో ప్రభుత్వ పిటిషన్‌ను ముగించిన హైకోర్టు
- కేసులో ఉన్న అంశాలపై వ్యాఖ్యానానికి నిరాకరణ
- కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలతో ప్రభుత్వానికి సంబంధం లేదు
- గవర్నర్‌పై వ్యాఖ్యల్ని ఖండిస్తున్నామన్న దుష్యంత్ దవే



హైదరాబాద్(శుభ తెలంగాణ): రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టే విషయంలో గవర్నర్ కార్యాలయం, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య నెలకొన్న రాజకీయ సంక్షోభ పరిష్కారానికి హైకోర్టు వేదికైంది. మధ్యాహ్న భోజన విరామ సమయంలో మాట్లాడుకొని రావాలన్న హైకోర్టు సూచనతో గవర్నర్ కార్యాలయం, రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాదులు జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. బడ్జెట్ సమావేశాల తొలిరోజు గవర్నర్ ప్రసంగం ఏర్పాటు చేయడంతో పాటు ప్రసంగం రూపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ప్రభుత్వానికి గవర్నర్ అనుమతి ఇస్తారని గవర్నర్ కార్యాలయం న్యాయవాదులు తెలిపారు. ఇరువర్గాల మధ్య చర్చలు ఫలప్రదంగా ముగింపునకు వచ్చినందున పిటిషన్‌ను ముగిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కేసులో ఉన్న అంశాలు, రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ విచారణార్హతపై తాము ఎలాంటి వ్యాఖ్య చేయడం లేదని.. చర్చలు ఫలప్రదంగా ముగిసినందున పిటిషన్‌లో విచారణ ముగిస్తున్నట్లు హైకోర్టు ప్రకటించింది. గడువు ముంచుకొస్తున్నప్పటికీ బడ్జెట్ ప్రవేశపెట్టడానికి గవర్నర్ ఆమోదం తెలపలేదని, బడ్జెట్‌కు ఆమోదం తెలిపేలా గవర్నర్‌కు సూచించాలని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో సోమవారం లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. మధ్యాహ్నం అత్యవసరంగా పిటిషన్‌ను విచారించాలని.. ఉదయం 10.30 గంటలకు హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ ఎన్.తుకారాంజీ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట ఏజీ బీఎస్ ప్రసాద్, జీఏడీ న్యాయవాది కళ్యాణ్‌రావు ప్రస్తావించారు. ఢిల్లీ నుంచి సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే వస్తున్నారని.. లంచ్ మోషన్ మంజూరు చేయాలని కోరారు. లంచ్ మోషన్ మంజూరు చేసిన ధర్మాసనం.. మధ్యాహ్నం 1 గంటలకు విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే వాదనలు ప్రారంభించగానే ?ధర్మాసనం పలు ప్రశ్నలు సంధించింది. గవర్నర్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేయవచ్చా? గవర్నర్ విధుల వ్యవహారంలో న్యాయసమీక్షకు అవకాశం ఉందా? హైకోర్టు పరిధి ఏమిటి? న్యాయ వ్యవస్థ తన అధికార పరిధిని మీరుతోందని మీరే అంటుంటారు కదా? ఈ విషయంలో హైకోర్టు ఎలా జోక్యం చేసుకోగలదు? అని ప్రశ్నించింది. బడ్జెట్‌కు ఆమోదం తెలిపే విషయంలో గవర్నర్‌కు విచక్షణాధికారం లేదని, రాష్ట్ర మంత్రివర్గం చేసిన సిఫార్సును యధాతథంగా ఆమోదించాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 202 నిర్దేశిస్తోందని దవే తెలిపారు. ఆర్టికల్ 356, 371 ప్రకారం గవర్నర్‌కు స్వేచ్ఛ. విచక్షణాధికారం ఉంటుందని, ఆర్టికల్ 202 విషయంలో మాత్రం రాజ్యాంగం గవర్నర్‌కు విచక్షణాధికారం ఇవ్వలేదని తెలిపారు. బడ్జెట్ మనీ బిల్లు కిందకి వస్తుందని, ఆమోదం తెలపడం తప్ప గవర్నర్‌కు మరో అవకాశం లేదని తెలిపారు. రాజ్యాంగం ప్రకారం గవర్నర్ తన విధిని నిర్వహించకపోతే న్యాయసమీక్షకు తప్పకుండా అవకాశం ఉంటుందని.. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో చెప్పిందని గుర్తుచేశారు. గవర్నర్ రాజ్యాంగం నిర్దేశించిన ప్రకారం పని చేయాల్సిందేనని, వ్యక్తిగత వ్యవహా రాలకు, వ్యక్తిగత అసంతృప్తులకు ఇక్కడ తావులే దని స్పష్టం చేశారు. గవర్నర్ల అధికారాలపై సర్కారియా కమిషన్ స్పష్టమైన సిఫార్సులు చేసిందని తెలిపారు. గవర్నర్లు ప్రదర్శించే విచక్షణాధికారం

వివరాలు 2లో..

## బడ్జెట్‌కు లైన్‌క్లియర్



- సంయుక్త సమావేశానికి గవర్నర్ అనుమతి
- మండలి, అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగం
- బడ్జెట్ సమర్పణ పత్రాలపై గవర్నర్ సంతకం
- ఫిబ్రవరి 3న బడ్జెట్ సమావేశాలు ప్రారంభం
- తర్వాత 2, 3 రోజుల్లో ప్రవేశపెట్టే అవకాశం
- హైకోర్టు సూచనతో కుదిరిన రాజీ ఒప్పందం
- ఏజీ చాంబర్‌లో ఇరు పక్షాల లాయర్ల చర్చలు

హైదరాబాద్(శుభ తెలంగాణ): అందరిలోనూ ఒకింత ఉత్కంఠ రేకెత్తించిన 2023-24 వార్షిక బడ్జెట్‌కు మార్గం సుగమమ య్యింది. అనుకున్న ట్టుగానే ఫిబ్రవరి 3న బడ్జెట్ సమావేశాలు మొదలు

వివరాలు 2లో..

## డాక్యుమెంటరీపై నిషేధం చట్టవిరుద్ధం

- అత్యవసరంగా విచారణ చేపట్టండి
- సుప్రీంకు న్యాయవాదుల అభ్యర్థన
- వచ్చే వారం విచారిస్తామన్న ధర్మాసనం



హైదరాబాద్(శుభ తెలంగాణ): గుజరాత్‌లో 2002లో జరిగిన అల్లర్లకు సంబంధించి బీబీసీ డాక్యుమెంటరీ ప్రసారంపై కేంద్రం విధించిన నిషేధాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాల (పిల్స్)ను

వివరాలు 2లో..

## పాకిస్థాన్ మసీదులో ఉగ్రదాడి.. 25 మంది మృతి



- పెషావర్ సిటీలో మధ్యాహ్నం ప్రార్థన సమయంలో బాంబు పేలుడు
- 120 మందికి పైగా గాయాలు?
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం

వివరాలు 2లో..

రాష్ట్రంలో ఎనిమిదేండ్లలో వేసిన రైల్వేలైను పొడవు వంద కిలోమీటర్ల కన్నా తక్కువే. నత్తలు కూడా సిగ్గుపడేలా ఉన్న కేంద్రం పనితీరుకు ఎలాంటి అవార్డులు, బిరుదులు ఇవ్వాలో తెలియట్లే. బీజేపీ ఎంపీలు సోయి తెచ్చుకుని తెలంగాణ బిడ్డలుగా ఢిల్లీలో కొట్లాడేందుకు మాతో కలిసి రావాలి.

## తెలంగాణ రైల్వేలైన్లకు భారీగా నిధులివ్వాలి

- కేంద్రప్రభుత్వ వివక్షపై పార్లమెంటులో నిలదీస్తాం
- తెలంగాణ బిడ్డలుగా బీజేపీ ఎంపీలు కలిసి రావాలి
- ప్రధాని మోదీ ఒక్క రైల్వే ప్రాజెక్టు కూడా ఇవ్వలేదు
- కొత్తగా వేసిన రైల్వే లైను 100 కి.మీ.కన్నా తక్కువే
- వయో వృద్ధుల రైల్వే పాసులను పునరుద్ధరించాలి
- పీఎంకేవైలో ఎకరాకు 10 వేల రూపాయలివ్వాలి



హైదరాబాద్(శుభ తెలంగాణ): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణలో రైల్వేల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ ప్రభుత్వానికి

వివరాలు 2లో..

## 33 స్థానాల్లో ఒక్కడినే పోటీ చేస్తా

- గతేడాది విశ్వాస పరీక్షలో ఓడిపోయిన ఇమ్రాన్ ఖాన్
- ప్రధాని పదవి కోల్పోయిన వైనం
- తన పార్టీ ఎంపీలతో రాజీనామా చేయించిన ఇమ్రాన్
- రాజీనామాలను స్పీకర్ ఆమోదించడంతో ఉప ఎన్నికలు



వివరాలు 2లో..

## నేటి నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు

- జనవరి 31 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు
- ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్
- నేడు అఖిలపక్ష సమావేశం.. అన్ని పార్టీలకు ఆహ్వానం

వివరాలు 2లో..



## ముందస్తుకు పోతే సిరిసిల్లలో కేటీఆర్ కూడా ఔట్

హైదరాబాద్(శుభ తెలంగాణ): :ఇందూర్ ప్రజలను సీఎం కేసీఆర్ చిన్నచూపు చూస్తున్నారని నిజామాబాద్ బీజేపీ ఎంపీ అర్వింద్ ఆరోపించారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ గుర్తుకు రాలేదు కాని తిలక్ గార్డెన్ గుర్తుకు వచ్చి నిధులు కేటాయించారని విమర్శించారు. 100 రోజుల్లో చెరుకు ఫ్యాక్టరీని తెరిపిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయ కుండా ముందస్తుకు పోతే.

వివరాలు 2లో..



## అధికారం ఎవరి అబ్బ సొత్తు కాదు

- బీఆర్ఎస్ నాయకత్వంపై మరోసారి ధ్వజమెత్తిన పొంగులేటి
- ఎన్ని ఇబ్బందులు పెట్టినా వెనుకడుగు వేయబోనని వెల్లడి
- తన వెంట లక్షలాది హృదయాలు ఉన్నాయని ధీమా

వివరాలు 2లో..



## 33 స్థానాల్లో ఒక్కడినే పోటీ చేస్తా

ఉప ఎన్నికలు జరగనుండగా, తానొక్కడే 33 చోట్ల పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. దీనిపై పాకిస్థాన్ తెహ్రీకే ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ కోర్ కమిటీ సమావేశంలో తీర్మానించారు. పాకిస్థాన్ లో 33 పార్లమెంటరీ స్థానాలకు మరి కొన్నిరోజుల్లో ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ స్థానాల్లో గతంలో ఇమ్రాన్ ఖాన్ పార్టీకి చెందిన వారే విజయం సాధించారు. గత సంవత్సరం ఇమ్రాన్ ఖాన్ జాతీయ అసెంబ్లీలో విశ్వాసపరీక్షలో ఓటమి చెందగా, ఆయన తన పార్టీ ఎంపీలతో రాజీనామా చేయించారు. ఇప్పుడా రాజీనామాలను పాకిస్థాన్ నేషనల్ అసెంబ్లీ స్పీకర్ ఆమోదించడంతో ఉప ఎన్నికలు జరగనున్నాయి. పంజాబ్ ప్రావిన్స్ లో 12 స్థానాలు, సింధ్ ప్రావిన్స్ లో 9, ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ లో 8, ఇస్లామాబాద్ లో 3 స్థానాలు, బలూచిస్థాన్ ప్రావిన్స్ లో 1 స్థానానికి ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. దేశంలో ముందస్తు ఎన్నికలు డిమాండ్ చేస్తున్న ఇమ్రాన్ ఖాన్... ఆ దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకే 33 ఎంపీ స్థానాల్లో తానొక్కడే పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్టు పీటీఐ పార్టీ వర్గాలు తెలిపాయి.

## పాకిస్థాన్ మసీదులో ఉగ్రదాడి.. 25 మంది మృతి

పాకిస్థాన్ లో ఉగ్రవాద దాడి జరిగింది. మసీదులో బాంబు పేలడంతో 25 మంది చనిపోయారు. 120 మందికి పైగా గాయపడ్డారు. పెషావర్ సిటీలోని స్థానిక పోలీసు కార్యాలయంలో ఉన్న మసీదులో సోమవారం మధ్యాహ్నం ప్రార్థనలు చేసేందుకు 260 మంది దాకా వచ్చారు. ప్రార్థనలు జరుగుతుండగానే బాంబు పేలింది. పేలుడు ధాటికి మసీదు పైకప్పు దెబ్బతింది. గోడ ఒకవైపు పూర్తిగా కూలిపోయింది. ఆ ప్రాంతమంతా రక్తసిక్తమైంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రులకు తరలిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని డాక్టర్లు చెబుతున్నారు. కూలిన శిథిలాల కింద ఎవరైనా చిక్కుకుని ఉండొచ్చని భావిస్తున్నారు. ఇది ఆత్మాహుతి దాడి కావచ్చని అనుమానిస్తున్నారు. గతేడాది మార్చిలో పెషావర్ లోనే షియాలకు చెందిన మసీదుపై ఐసిస్ ఆత్మాహుతి దాడి చేయగా.. 64 మందికి పైగా చనిపోయారు. ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దులకు దగ్గరగా ఉండటంతో తెహ్రిక్-ఇ-తాలిబన్ (టీటీపీ), ఐసిస్ ఉగ్రవాదులు చెలరేగిపోతున్నారు. తాజా దాడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.ద

## నేటి నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు

పార్లమెంటు బడ్జెట్ సమావేశాలకు రేపు (జనవరి 31) తెర లేవనుంది. నరేంద్ర మోదీ సర్కారుకు ఇదే పూర్తిస్థాయి చివరి బడ్జెట్ కానుండ డంతో, రేపట్నించి జరిగే పార్లమెంటు సమావేశాలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈసారి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు రెండు విడతల్లో జరగనున్నాయి. తొలి విడత జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కొనసాగుతాయి. రెండో విడత మార్చి 13న ప్రారంభమై ఏప్రిల్ 6తో ముగుస్తాయి. ఇక, ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. కరోనా సంక్షోభం దాదాపు ముగిసిన నేపథ్యంలో, దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థకు కేంద్ర ఆర్థికమంత్రి ఎలాంటి ఉపశమనాలు కలుగజేస్తారన్నది ఆసక్తి కలిగిస్తోంది. కాగా, రేపటి నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు జరగనుండగా, కేంద్రం నేడు అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది. ఈ మేరకు అఖిలపక్ష సమావేశానికి రావాలంటూ కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి కార్యాలయం వివిధ పార్టీలకు ఆహ్వానాలు పంపింది. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో, దేశ రాజధానిలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

## ప్రాణాలైనా ఇచ్చేస్తా కానీ బీజేపీతో మళ్లీ చేతులు కలపను

బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను జీవించి ఉన్నంత వరకు బీజేపీతో మళ్లీ పొత్తు పెట్టుకునేది లేదని సోమవారం ప్రకటించారు. 'నా ఊపిరి ఉన్నంత వరకు మళ్లీ బీజేపీతో కలిసి వెళ్లను. మరణాన్నిఅయినా అంగీకరిస్తాను కానీ బీజేపీతో కలిసి నడవను" అని సీఎం నితీశ్ కుమార్ అన్నారు. తనకు ముఖ్యమంత్రి కావాలనే కోరిక లేదని, బీజేపీనే బలవంతంగా తనను సీఎం చేసిందన్నారు. ఎన్నికలు జరిగితే ఎవరికి ఎన్ని సీట్లు వస్తాయో అందరికీ తెలుస్తుందని ఆయన అన్నారు. బీజేపీ ప్రస్తుత నాయకత్వం అహంకార పూరితంగా వ్యవహరిస్తుందన్న నితీశ్.. అటల్ బిహారీ వాజ్‌పేయి, లాల్ కృష్ణ అద్వానీల హయాంను గుర్తు చేసుకున్నారు. వాజ్‌పేయి, అద్వానీలను తాను గౌరవిస్తామని, ఎల్లప్పుడూ వారికి అనుకూలంగా ఉన్నామని చెప్పారు.

## ముందస్తుకు పోతే సిరిసిల్లలో కేటీఆర్ కూడా ఔట్

- మొదటి పేజి తరువాయి

సిరిసిల్లలో కేటీఆర్ కూడా ఓడిపోతారని అర్వింద్ చెప్పారు. ఇందూరు సభలో కేటీఆర్ రిజైన్ చేస్తాననగానే అక్కడున్న వాళ్లు చప్పట్లు కొట్టిన విషయాన్ని అర్వింద్ గుర్తు చేశారు. పసుపు బోర్డు విషయంలో కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం తప్ప వీళ్లు చేసిందేమి లేదని కేసీఆర్, కేటీఆర్ పై అర్వింద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పైస్ బోర్డు ద్వారా రూ.30 కోట్లు అదనంగా తీసుకువచ్చామని చెబుతున్నారు గానీ.. ఆ నిధులతో పసుపు పంటకు గాని.. చెరుకు పంటకు ఏమీ చేయలేదన్నారు. సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చాక సామాన్యుల పరిస్థితి మరింత దిగజారిందని ఎంపీ అర్వింద్ ఆరోపించారు.

## డాక్యుమెంటరీపై నిషేధం చట్టవిరుద్ధం

- మొదటి పేజి తరువాయి

విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. వచ్చే సోమవారం వీటిపై విచారణ జరుపుతామని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలో న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దీవాలాతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. కేంద్రం నిర్ణయాన్ని సవాల్ చేస్తూ న్యాయవాది ఎం.ఎల్ శర్మ ఒక వ్యాజ్యం, ప్రముఖ జర్నలిస్టు ఎన్. రామ్, న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌లు మరో వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. రామ్, ప్రశాంత్ భూషణ్‌ల తరఫున సీనియర్ అడ్వొకేట్ సీయూ సింగ్, తాను వేసిన పిల్‌పై న్యాయవాది శర్మ ధర్మాసనం ముందు హాజరై.. వ్యాజ్యాలను అత్యవసరంగా విచారించాలని కోరారు. డాక్యుమెంటరీ ప్రసారాలపై నిషేధం విధించడం చట్టవిరుద్ధం, దుర్మార్గం, ఏకపక్షం, రాజ్యాంగ విరుద్ధమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుని.. వ్యాజ్యాన్ని సోమవారం నాటి కేసుల్లో చేర్చుతామని పేర్కొంది.

### సుప్రీం విలువైన సమయం ఇలా వృథా: రిజిజు

బీబీసీ డాక్యుమెంటరీపై నిషేధం నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేసినవారిపై న్యాయశాఖ మంత్రి కిరెన్ రిజిజు మండిపడ్డారు. అత్యున్నత న్యాయస్థానం యొక్క విలువైన సమయాన్ని ఇలా వృథా చేస్తున్నారని విమర్శించారు. 'వేలాదిమంది సామాన్య పౌరులు న్యాయం కోసం ఎదురుచూస్తున్నారు. గౌరవనీయ సుప్రీంకోర్టు విలువైన సమయాన్ని వీరు ఇలా వృథా చేస్తున్నారు' అని రిజిజు ట్వీట్ చేశారు. కాగా, స్వతంత్ర విధానాన్ని అనుసరించే దేశాలపై బీబీసీ సమాచారం యుద్ధం చేస్తోందని, జర్నలిజం విలువలకు పాతరేస్తోందని రష్యా నిప్పులు చెరిగింది. మోదీపై డాక్యుమెంటరీనే ఇందుకు ఉదాహరణ అని పేర్కొంది.

# తెలంగాణ రైల్వేలైన్లకు భారీగా నిధులివ్వాలి

- మొదటి పేజి తరువాయి

ఇదే ఆఖరు బడ్జెట్ అని, ఈసారైనా విభజన హామీల అమలుకు పూనుకోవాలని కోరారు. మోదీ ప్రభుత్వం ఎనిమిదేండ్లలో తెలంగాణలో వేసిన రైల్వేలైన్ల పొడవు 100 కిలోమీటర్ల కంటే తక్కువేనని ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం ఆయన సిరిసిల్ల నియోజకవర్గంలో ఆకస్మికంగా పర్యటించారు. ముందుగా వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో ఇటీవల చనిపోయిన బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు గొల్లపల్లి కిషన్, దేవేందర్ కుటుంబసభ్యులను పరామర్శించారు. వీర్నపల్లిలో కంటి వెలుగు వైద్యశిబిరాన్ని సందర్శించి, అక్కడి వైద్య సేవలపై ప్రజలను ఆరా తీశారు.

అనంతరం రంగంపేట గ్రామంలో దళితబంధు పథకం కింద కుమ్మరి దేవయ్య స్థాపించిన టిఫిన్ సెంటర్‌ను కలెక్టర్ అనురాగ్ జయంతితో కలిసి సందర్శించి అల్పాహారం చేశారు. అక్కడి నుంచి వెంకటాపూర్ మండలం పోతిరెడ్డిపల్లెకు చేరుకుని బీఆర్ఎస్ నాయకుడు కనుకంట్ల బాలయ్య కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పార్లమెంటు సాక్షిగా కేంద్రం ఎన్నో హామీలు ఇచ్చింది. కాజీపేటలో రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కొత్త విద్యాసంస్థల ఏర్పాటుకు హామీ ఇచ్చింది. కేంద్రం తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట నిలుపుకోడానికి మోదీ ప్రభుత్వానికి ఖచ్చితంగా ఇదే చివరి అవకాశం. కేంద్రానికి నిజాయితీ ఉంటే ఆఖరి బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను, తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నలుగురు బీజేపీ ఎంపీలను డిమాండ్ చేస్తున్నా'నని పేర్కొన్నారు. 'తెలంగాణ నిధులను కేంద్రం తిన్నది. తెలంగాణ ప్రజల చెమట, రక్తం మీ వెనుకబడ్డ రాష్ట్రాలకు వాడుకున్నారు. తెలంగాణ నుంచి రూ.3,68,000 కోట్లు పన్నుల రూపంలో కడితే.. మీరు ఇచ్చింది రూ.1,68,000 కోట్లు మాత్రమే'నని స్పష్టంచేశారు. తొమ్మిదేండ్లలో బీజేపీ ఎంపీలు తెలంగాణకు నయా పైసా పని కూడా చేయలేదని, తాను చెప్పిన మాట తప్పయితే దేనికైనా సిద్ధమని సవాల్ విసిరారు. మోదీ హయాంలో తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులు అధోగతి పాలయ్యాయని మండిపడ్డారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఒక్క కొత్త రైల్వేలైను కానీ, ఒక్క ప్రాజెక్టును కానీ మోదీ ప్రభుత్వం ఇచ్చిన పాపాన పోలేదని విమర్శించారు. గత ప్రభుత్వంలో మంజూరైన కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైనును పూర్తి చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ఎనిమిదేండ్లలో వేసిన రైల్వేలైను పొడవు వంద కిలోమీటర్ల కన్నా తక్కువేనని, ఇంతకంటే సిగ్గుచేటు లేదని దుయ్యబట్టారు. నత్తలు కూడా సిగ్గుపడేలా ఉన్న కేంద్రం పనితీరుకు ఎలాంటి అవార్డులు, బిరుదులు ఇవ్వాలో తనకైతే తెలియడం లేదని ఎద్దేవా చేశారు. బీజేపీ ఎంపీలు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తిట్టడం కాదని, సోయి తెచ్చుకుని తెలంగాణ బిడ్డలుగా ఢిల్లీలో కొట్లాడేందుకు తమతో కలిసి రావాలని హితవు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న రైతుబంధు మాదిరిగా పీఎం కిసాన్ పథకంలో ప్రతి రైతుకూ ఎకరా రూ.10 వేల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# ఇంటర్ బోర్డులో రచ్చ

- మొదటి పేజి తరువాయి

కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిత్తల్ కార్యాలయంలోకి మధుసూదన్‌రెడ్డి అనుమతి లేకుండా ప్రవేశించి కంప్యూటర్‌లోని పాస్‌వర్డ్‌ను మార్చారని.. కొంత డేటా డిలీట్ చేశారని.. అంతటితో ఆగక తమపై దౌర్జన్యం చేయడానికి ప్రయత్నించారని బోర్డు డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి మధుసూదన్‌రెడ్డిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించిన సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నామని.. మంగళవారం మధుసూదన్‌రెడ్డికి నోటీసులు అందజేసి అదుపులోకి తీసుకుంటామని చెప్పారు. ఇంటర్ పరీక్షలకు సంబంధించి ఆన్‌లైన్ వాల్యుయేషన్ టెండర్ ప్రక్రియపై మధుసూదన్‌రెడ్డి రెండు రోజుల క్రితం పలు ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనపైనే అధికారులు పోలీసస్టేషన్‌లో ఫిర్యాదు చేయడం గమనార్హం.

### సూత్రధారులెవరో తేలుతుంది..

ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్‌మిత్తల్ సోమవారం దీనిపై విలేకరుల సమావేశం నిర్వహించారు. బోర్డులో భద్రత వ్యవస్థ ట్యాంపరింగ్‌కు గురైందని.. సీసీ కెమెరాలకు సంబంధించిన పాస్‌వర్డ్ చోరీ జరిగిందని.. కొంతమంది ఉద్దేశ్యపూర్వకంగానే ఈ పని చేశారని, దీన్ని గుర్తించగానే పోలీసులకు ఫిర్యాదు చేశామని ఆయన చెప్పారు. దీని వెనుక సూత్రధారులెవరో, ఏ అవసరాల కోసం ఈ చర్యకు పాల్పడ్డారో దర్యాప్తులో తేలుతుందన్నారు. బోర్డుకు సంబంధించిన ఓ అధికారిని నేరచరిత్ర ఉన్న ఓ వ్యక్తి బెదిరించి, భయపెట్టి పాస్‌వర్డ్‌ను తస్కరించినట్టు ప్రాథమికంగా తెలిసిందన్నారు. దీనిపై శాఖాపరమైన విచారణకూ ఆదేశాలిచ్చినట్టు మిట్టల్ తెలిపారు. అంతేకాదు.. ఇంటర్ వ్యవస్థను ఒక వ్యక్తి గుప్పిట్లో పెట్టుకున్నారని ఆయన ఆరోపించారు. "నేను ఒక అధికారితో మాట్లాడిన విషయాలు మూడో వ్యక్తికి వెంటనే తెలిసిపోతున్నాయి. సీసీ కెమెరాల పాస్‌వర్డ్‌ను కూడా ప్రస్తుతం ఉద్యోగంలో లేని వ్యక్తి రన్ చేస్తున్నాడు. ఇలా ఇంటర్ బోర్డును ఓ అదృశ్యవ్యక్తి నడిపిస్తున్నాడు" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో ఆయన.. మీడియా కూడా పెయిడ్ న్యూస్ వేస్తోందని ఆరోపించడంతో విలేకరులు తీవ్ర నిరసన తెలిపారు. దీంతో మిట్టల్ క్షమించాలని కోరారు. మ్యాన్యువల్ వాల్యుయేషన్ ద్వారా డబ్బులు సంపాదించే వారు ఆన్‌లైన్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నారని, లేనిపోని అనుమానాలు, అపోహలు సృష్టిస్తున్నారని ఆరోపించారు.

### నా ప్రాణాలకు ముప్పు..

కొన్ని ఐటీ కంపెనీలతో కలిసి కొంతమంది అధికారులు తనకు హాని చేయడానికి సిద్ధమయ్యారని, తనను అంతం చేయడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. భౌతికంగా తనకు ఏ హాని జరిగినా.. అందుకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్‌మిత్తల్ బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పారు. ఇంటర్ బోర్డును సవ్యంగా నిర్వహించలేక తనపై తప్పుడు అరోపణలు చేస్తున్నారని ఆయన వెల్లడించారు.

# లౌకికవాద పరిరక్షణకే జోడో

- మొదటి పేజి తరువాయి

నేషనల్ కాన్ఫరెన్స్ నేతలు ఫరూక్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, పీడీపీ నాయకురాలు మెహబూబా ముఫ్తీ, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, డీఎంకే ఎంపీ తిరుచి శివ, ఆర్ఎస్‌పీ ఎంపీ ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్ తదితరులు పాల్గొన్నారు. తనలాగే బీజేపీ నేతలు కూడా జమ్మూకశ్మీరులో యాత్ర సాగించాలని రాహుల్ ఈ సందర్భంగా సవాల్ విసిరారు. 'వారా పని చేయలేరు. అడ్డుకుంటారని కాదు.. భయం కారణంగానే చేయలేరు. నాపై దాడి జరగొచ్చని.. జోడో యాత్ర కశ్మీర్లో వద్దని కొందరు సలహా ఇచ్చారు. దీనిపై ఆలోచించాను. చివరకు నా ఇంట్లో, నా ప్రజలతో కలిసి నడవాలని నిర్ణయించుకున్నాను. తెల్లటి నా టీ షర్టును ఎర్రగా మార్చే అవకాశం ఇద్దామనుకున్నాను. కానీ కశ్మీరీలు నాకు హ్యాండ్ గ్రెనేడ్లు ఇవ్వలేదు.. ప్రేమ నిండిన హృదయాలను ఇచ్చారు' అని వ్యాఖ్యానించారు. మాజీ ప్రధానులైన తన నాయనమ్మ ఇందిరాగాంధీ, తండ్రి రాజీవ్‌గాంధీలు హత్యకు గురైనప్పుడు ఫోన్ కాల్స్ ద్వారా ఈ విషయం తెలిసిందని.. హింసను ప్రేరేపించే ప్రధాని మోదీ, అమిత్‌షా, బీజేపీ, ఆర్ఎస్ఎస్.. ఆ బాధను ఎప్పటికీ తెలుసుకోలేరని అన్నారు. 'ఓ సైనికుడి కుటుంబం ఆ బాధను అర్థం చేసుకోగలుగుతుంది. ఇలాంటి కాల్ వస్తే ఎలా ఉంటుందో పుల్వామాలో హత్యకు గురైన సీఆర్‌పీఎఫ్ సిబ్బంది కుటుంబాలు, కశ్మీరీలకు అర్థమవుతుంది. మనం ప్రేమించేవారి మరణ సమాచారం తెలిపే ఈ ఫోన్ కాల్స్ ఇక రాకుండా చేయడమే నా యాత్ర లక్ష్యం' అని తెలిపారు. ఈ సభకు మొత్తం 21 పార్టీలను ఆహ్వానించగా.. టీఎంసీ, సమాజ్‌వాదీ పార్టీ స్పందించలేదు. ప్రతికూల వాతావరణం కారణంగా విమానాలు రద్దవడం, ఆలస్యం కావడం.. శ్రీనగర్-జమ్ము హైవే మూసివేయడం తదితర కారణాలతో మిగతా విపక్షాల నేతలు సభకు రాలేకపోయారు.

## బడ్జెట్‌కు లైన్‌క్లియర్

- మొదటి పేజి తరువాయి

కానున్నాయి. బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజున ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు. మండలి, అసెంబ్లీ సంయుక్త సమావేశానికి గవర్నర్ అనుమతి ఇచ్చారు. బడ్జెట్ సమర్పణ పత్రాలపై సంతకం చేశారు. రాష్ట్ర హైకోర్టు సూచనలతో రాష్ట్ర ప్రభుత్వం, రాజ్‌భవన్ న్యాయవాదుల మధ్య సోమవారం రాజీ కుదిరింది. హైకోర్టులో అత్యవసరంగా దాఖలు చేసిన పిటిషన్ విషయంలో ప్రభుత్వం, రాజ్‌భవన్ న్యాయవాదుల మధ్య అడ్వొకేట్ జనరల్ చాంబర్‌లో జరిగిన చర్చలు ఫలించాయి. తమకు ఎలాంటి దురుద్దేశాలు లేవని రాజ్‌భవన్ న్యాయవాది పేర్కొనగా, సంయుక్త సమావేశాల్లో గవర్నర్ ప్రసంగానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని ప్రభుత్వం తరపు న్యాయవాది చెప్పారు. దీంతో ఇరుపక్షాల మధ్య అపోహలు తొలగిపోయాయి. బడ్జెట్ సమావేశాలపై స్పష్టత వచ్చింది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశాలతో శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు సోమవారం సాయంత్రం రాజ్‌భవన్‌కు వెళ్లారు. గవర్నర్ తమిళిసైతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం మనోగతాన్ని గవర్నర్ దృష్టికి తీసుకొచ్చారు. చాలా సంతోషమని, తాను కూడా పూర్వపు వాతావరణాన్నే కోరుకుంటున్నానని, ఇప్పటి వరకు జరిగింది ఏదీ వ్యక్తిగతం కాదని గవర్నర్ స్పష్టం చేశారు. దీనితో ఇటు ప్రభుత్వం, అటు రాజ్‌భవన్ మధ్య సుహృద్భావ వాతావరణం నెలకొన్నట్టయ్యింది. మంత్రి, అధికారుల బృందం గవర్నర్‌తో భేటీ తరువాత బడ్జెట్ సమావేశాలకు మార్గం సుగమమైంది. ఫిబ్రవరి 3న బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అవుతాయి. ఆ రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. ఆ తరువాత రెండు, మూడు రోజుల్లో బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి ప్రవేశపెడతారు. ఇందుకు సంబంధించిన బడ్జెట్ సమర్పణ పత్రాలపై గవర్నర్ సంతకం చేశారు. అలాగే శాసనససభ, మండలి సంయుక్త సమావేశానికి గవర్నర్ అనుమతించారు.

## దిగొచ్చిన సర్కారు!

- మొదటి పేజి తరువాయి

సైతం రాజ్యాంగబద్ధంగా ఉండాలన్నారు. బడ్జెట్‌కు ఆమోదం తెలిపేలా గవర్నర్‌కు ఆదేశాలు ఇవ్వడంపై హైకోర్టుకు రావడం ప్రభుత్వానికి కూడా బాధాకరమని, ఇలా పిటిషన్ వేయాల్సి రావడం పట్ల ప్రభుత్వం కూడా సంతోషంగా లేదని చెప్పారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే కోర్టుకు రావాల్సి వచ్చిందని వివరించారు. ఈ దశలో జోక్యం చేసుకున్న ధర్మాసనం.. రెండు రాజ్యాంగ వ్యవస్థలు ఇలా ఘర్షణకు దిగితే ఎలా? తమిళనాడులో సైతం విభేదాలు వచ్చాయని పత్రికల ద్వారా తెలిసింది. కానీ అక్కడ ఇలాంటి పరిస్థితి తలెత్తిందా? అని ధర్మాసనం ప్రశ్నించింది. తన 44 ఏళ్ల న్యాయవాద వృత్తి జీవితంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ తలెత్తలేదని, తన జీవితకాలంలో ఎంతో మంది గవర్నర్‌లను చూశానని, ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ రాలేదని దవే చెప్పారు.

### కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

మధ్యాహ్నం 2.30 గంటలకు దవే వాదనలు వినిపిస్తూ.. ఇరువర్గాల మధ్య చర్చలు ఫలప్రదంగా ముగిశాయని, గవర్నర్ ప్రసంగం ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. గవర్నర్ పట్ల కించపర్చే వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఆ మాటకువస్తే దేశంలో ఏ మహిళనూ కించపర్చరాదని అన్నారు. ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలతో తాము ఏకీభవించడం లేదని, ఆ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని చెప్పారు. కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను ప్రెస్‌మీట్ పెట్టి ఖండించాలని ప్రభుత్వానికి సూచిస్తామన్నారు.

### రాజ్యాంగం ప్రకారం వ్యవహరించాలి

గవర్నర్ కార్యాలయం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది అశోక్ ఆనంద్ కుమార్ వాదనలు వినిపిస్తూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 176 ప్రకారం ప్రతి ఏడాది తొలి అసెంబ్లీ సెషన్‌లో గవర్నర్ ప్రసంగం తప్పనిసరి అని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆ విధిని పూర్తిచేస్తే బడ్జెట్‌కు ఆమోదం తెలపడానికి గవర్నర్‌కు అభ్యంతరం లేదని తెలిపారు. గత ఏడాది ప్రజా సంక్షేమం దృష్ట్యా గవర్నర్ ప్రసంగం లేకపోయినా బడ్జెట్‌కు ఆమోదం తెలిపామని గుర్తు చేశారు. గణతంత్ర దినోత్సవానికి సీఎంను, మంత్రులను ఆహ్వానించినా రాలేదని ప్రస్తావించారు. ఎట్‌హోం కార్యక్రమంలో గవర్నర్ బిజీగా ఉన్న సందర్భంలో గవర్నర్ హోదాకు తగని విధంగా ఒక ఐఏఎస్ బడ్జెట్ గురించి చర్చించే ప్రయత్నం చేశారని చెప్పారు. ప్రభుత్వం రాజ్యాంగం ప్రకారం వ్యవహరిస్తే అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. రాజీకి ఇరువర్గాలు సానుకూలత తెలిపినం దున కేసులోని మెరిట్స్‌పై, పిటిషన్ విచారణార్హతపై ఎలాంటి వ్యాఖ్య చేయకుండా పిటిషన్‌ను ముగిస్తున్నామని ప్రకటించింది.

# అధికారం ఎవరి అబ్బ సొత్తు కాదు

**ఖమ్మం** : ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరోసారి బీఆర్ఎస్ నాయకత్వంపై ధ్వజమెత్తారు. రాష్ట్రంలో 24 గంటల విద్యుత్ ఎక్కడైనా వస్తుందా? అని ప్రశ్నించారు. రుణమాఫీ కూడా 20 శాతమే చేశారని ఆరోపించారు. దీనిపై సీఎం కేసీఆర్ సమాధానం చెప్పగలరా? అని నిలదీశారు. అధికారం ఎవరి అబ్బ సొత్తు కాదని అన్నారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా వెనుకడుగు వేయను అని స్పష్టం చేశారు. నాడు కురుక్షేత్రంలో కౌరవులంతా ఒక పక్కన ఉన్నారని, కానీ నేడు శీనన్న వెంట లక్షలాది హృదయాల మద్దతు ఉందని, ఆ తుపానులో మీరు కొట్టుకుపోవడం తథ్యం అని వ్యాఖ్యానించారు. ఓ చిన్న కుటుంబం నుంచి వచ్చిన తనను జిల్లాలో ప్రతి ఒక్క కుటుంబం తమ గుండెల్లో పెట్టి చూసుకుంటోందని, అందుకే ప్రతి ఒక్కరికీ చేతులు జోడించి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు. జిల్లాలో ఉన్న ప్రజాప్రతినిధులందరూ తన పక్షానే నడుస్తారని తెలిపారు. శీనన్న ఏ తప్పు చేయలేదని, ఎప్పటికీ తప్పు చేయడని తన గురించి తాను చెప్పుకున్నారు. నమ్ముకున్న కార్యకర్తలకు ధైర్యం ఇచ్చే విషయంలో శీనన్న వెనుకడుగు వేయబోడని స్పష్టం చేశారు. "ఒకప్పుడు వైసీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న నేను, ఖమ్మం ఎంపీగా ఉన్న నేను వారి మాటలు నమ్మి నాడు టీఆర్ఎస్ పార్టీలో చేరాను. నాతో పాటు వందలాది మంది ప్రజాప్రతినిధులు, వేలాది మంది అభిమానులు టీఆర్ఎస్ పార్టీకి జై కొట్టామన్నది నిజం. పార్టీలో చేరినప్పుడు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడమే

కాకుండా, జిల్లాలో పార్టీ అభ్యర్థుల ఓటమికి పనిచేశానంటూ నాపై నిందలు మోపారు. ఆ తర్వాత పెద్దలు కేసీఆర్, కేటీఆర్ మాట విని నాడు టీఆర్ఎస్ అభ్యర్థి కోసం గ్రామగ్రామాన తిరిగి విజయం కోసం కృషి చేశాను. కానీ నన్ను ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎన్నో ఇబ్బందులకు గురిచేశారు" అని పొంగులేటి వివరించారు.

# కేసీఆర్ చిల్లర రాజకీయాలు చేస్తుండు

- మొదటి పేజి తరువాయి

కావాలనే కోర్టుకు వెళ్లిందని ప్రభుత్వం పై మండిపడ్డారు. ఎమ్మెల్యేల ఫిరాయింపులు ఫైల్ ఎంతవరకు వచ్చిందో శాసనసభ స్పీకర్ చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు ఎన్నో ఉన్నాయని వాటిని పక్కనపెట్టి.. కేసీఆర్ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని బండి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ సర్కార్ తీరుతో తెలంగాణలో సర్పంచులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని బండి సంజయ్ అన్నారు. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. స్టీల్ ఫ్యాక్టరీ డీపీఆర్ ఇవ్వటం లేదని కేంద్రమే స్వయంగా చెబుతోందన్నారు. మరోవైపు ఎస్సై, కానిస్టేబుల్ పరీక్షల్లో ప్రశ్నాపత్రాలు తప్పులు తడకగా ఉన్నాయని విమర్శించారు. ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఇప్పుడు ప్రభుత్వం ఏమని సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్నందునే ఎంపీ అర్వింద్ పై ప్రభుత్వం కక్ష కట్టిందని బండి ఆరోపించారు.

## సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్ కుటుంబ సభ్యులను పరామర్శించిన

- తెలంగాణ స్టేట్ జర్నలిస్టు అసోసియేషన్ నాయకులు యాదగిరి, బాలు శ్యామ్, తదితరులు పాల్గొన్నారు



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమళ్ళ అన్నపూర్ణ తండ్రి అనుమలపురి నరసయ్య ఇటీవల మృతి చెందారు. కాగా చైర్ పర్సన్ కుటుంబ సభ్యులను సూర్యాపేట జర్నలిస్టులు తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ అసోసియేషన్ నాయకులు సోమవారం ఆమె నివాసానికి వెళ్లి నరసయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం చైర్పర్సన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరి యాదగిరి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ధూపాటి శాంబాబు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దుర్గం బాలు, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు చిలుకల చిరంజీవి సూర్యాపేట నియోజకవర్గ అధ్యక్షుడు రామచంద్ర రాజు నేరేడుచర్ల మండల అధ్యక్షుడు సురేష్ సూర్యాపేట పట్టణ ప్రధాన కార్యదర్శి యాతాకుల మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## హలో బిసి చలో ఢిల్లీ కరపత్రం ఆవిష్కరణ



మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం బయ్యారం మెయిన్ రోడ్డు నందు తెలంగాణ బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్త వినయ్ బాబు ఆధ్వర్యంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం తరఫున" హలో బీసీ చలో ఢిల్లీ, కార్యక్రమానికి సంబంధించిన. ఢిల్లీ పార్లమెంటు పరిధిలో ఉన్నటువంటి జంతర్ మంథర్ వద్ద ఫిబ్రవరి 6, 7, 8 తేదీలలో దేశవ్యాప్తంగా సమగ్ర కుల గణన చేపట్టి అందుకు అనుగుణంగా బీసీలకు కావలసిన రిజర్వేషన్లు వర్తింప చేయాలంటూ చేపట్టబోయే ధర్నా కార్యక్రమం సంబంధించిన కరపత్రంను ఆవిష్కరించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జడ్పీ చైర్ పర్సన్ మరియు మాజీ ఇల్లెందు నియోజకవర్గ శాసనసభ సభ్యులు కోరం కనకయ్య ఆధ్వర్యంలో ఢిల్లీలో జరగబోయే ధర్నా కార్యక్రమం కు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు.. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గండు సురేశ్ కుమార్ గౌడ్, కోశాధికారి కీర్తి ఉదయ్ మేరు, రామచంద్రపురం సర్పంచ్ పోలబోయిన వెంకటేశ్వర్లు గారు, బయ్యారం మండలం టిఆర్ఎస్ సీనియర్ నాయకులు రెంటాల బుచ్చి రెడ్డి గారు, బయ్యారం మేజర్ గ్రామపంచాయతీ వార్డు మెంబర్ సుమన్ గారు, టిఆర్ఎస్ మండలం నాయకులు మరియు బీసీ నాయకులు నందగిరి భద్రయ్య గారు, రామారావు గారు, పగడాల శీను గారు గౌడ్, బొమ్మగాని శీను గౌడ్ గారు. తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర క్యాలెండర్ ఆవిష్కరణ



**హైదరాబాద్ సిటీ బ్యూరో, శేర్లింగంపల్లి :** శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ లోని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతరాజు లాలయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నరసయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెలమకంటి దయాకర్ ,పారంది స్వామి ,మల్లెల జయ ,మమ్మద్ అలీ ,యాదగిరి ,రాష్ట్ర అధికార ప్రతినిధి తూముల సదానందం ,రాష్ట్ర నాయకులు చిర్ర ప్రభాకర్ , మేకల చేరాలు , శేరిలింగంపల్లి మండల అధ్యక్షులు జిల్లే విజయ్. ఉపాధ్యక్షులు సూర్యకిరణ్ .డప్పు నాగేష్, రమేష్ ,రామకృష్ణ గౌడ్ నాయకులు బసవరాజు, అంబాల ఆనంద్ , ఘనపురం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి వరంగల్ జిల్లా కి చెందిన నైనేష్ ఆదివారం మెగాస్టార్ చిరంజీవి హనుమకొండ జిల్లా కి విచ్చేసిన సందర్భంగా మర్యాపురకంగా కలువడం జరిగింది.

# డబుల్ బెడ్ రూములు హ్యూమన్ రైట్స్ సభ్యులకు ఇవ్వాలి

### ఎమ్మెల్యే మాణిక్యరావు కు వినతి పత్రాన్ని సమర్పించిన ప్రెసిడెంట్ మంగళ పెల్లి హుస్సేన్ కమిటీ సభ్యులు



**తొర్రూర్ డివిజన్** :జహీరాబాద్ డివిజన్ జనవరి 30 సోమవారం సంగారెడ్డి జిల్లా స్థానిక మున్సిపల్ కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఈరోజు జాతీయ మానవ హక్కుల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు మంగళ పెల్లి హుస్సేన్ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే మాణిక్యరావును హృదయపూర్వకంగా కలిసి అనంతరం డబుల్ బెడ్ రూములు హ్యూమన్ రైట్స్ సభ్యులకు అందేలా చేయాలని కలిసి మాట్లాడి చర్చించి వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది, ఈ సందర్భంగా అధ్యక్షుడు మంగళ పెల్లి హుస్సేన్ మాట్లాడుతూ సామాజిక సేవ చేస్తూ నిస్వార్థంగా పనిచేస్తున్న డివిజన్ నియోజకవర్గ సభ్యులకు డబుల్ బెడ్ రూములు ఇవ్వాలని అన్నారు, నిరంతరం సభ్యులు సంఘ సేవ చేసుకుంటూ విద్యార్థులకు, ప్రజలకు,అందుబాటులో ఉంటున్నారని వారికి వివరించడం జరిగింది,ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్యరావు మాట్లాడుతూ. కచ్చితంగా హ్యూమన్ రైట్స్ సభ్యులకు డబుల్ బెడ్ రూములు అందేలా చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ కొల్లూరు నగేష్, డివిజన్ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ప్రెసిడెంట్. అంజమ్మ, జిల్లా వైస్ ప్రెసిడెంట్ మహిళా విభాగం విజయలక్ష్మి, స్వరూపమా, తుల్జమ్మ, కోహిరు మండలం మల్లమ్మ, శాంతమ్మ, విలేకర్ చాంద్ పాషా,తదితరులు పాల్గొన్నారు,

# 560 జీవోను అమలు చేయాలి తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం



జనవరి 30 సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు ఎలుగురు గోవిందు లితెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం క్యాలెండర్ ను సోమవారం సూర్యాపేటలోని %ఖ+ఖు% ఆఫీసులో జిల్లా నాయకులు చేతులు ఘనంగా ఆవిష్కరించారు ఈ కార్యక్రములో ముఖ్యఅతిథి జిల్లా అధ్యక్షులు ఎలుగురు గోవిందు మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని గీత కార్మికులందరికీ ఉపాధి కలిగే విధంగాచర్యలు చేపట్టాలని వృత్తిలో ప్రమాదాలు జరగకుండా మరణాలు సంభవించకుండా చూడాలని కోరారు అందుకోసం ఆధునిక పరికరాలు ఇవ్వాలని మారుతున్న పరిస్థితులు కనుగొనంగా వృత్తిలో మార్పులు తీసుకురావాలని కోరారు అదే విధంగా 560 జీవోప్రకారం ప్రతి సొసైటీకి ఐదు ఎకరాల భూమిని వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు 2021 .2022 బడ్జెట్లో కేటాయించిన డబ్బులు టాడి కార్పొరేషన్ కు ఇవ్వాలని సేఫ్టీ మోకుద్విచక్ర వాహనాలు తదితర సంక్షేమ పథకాలు అమలు చేయాలని అన్నారు నీరా కల్లుకు తేడా తెలియని బ్రాహ్మణ సంఘాలు వేదామృతం పేరు పై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు విదేశీ బహుళ జాతి కార్పొరేట్ సంస్థలు ఉత్పత్తి చేస్తున్న లిక్కర్ శీతల పానీయాలు తంసప్కాకోకోలాలంటే ఆరోగ్యానికి హాని కలిగించే వాటిని తాగమంటున్నారు వాటికి ఎలాంటి పేర్లు పెట్టిన అభ్యంతరం తెలపని వీరు ప్రకృతి పానీయం ఎన్నో పోషక విలువలు కలిగి ఆరోగ్యానికి మంచిదైన స్వదేశీ నీరా కు వేదామృతం అని పేరు పెడితే ఆ పేరు వద్దని రాద్ధాంతం చేస్తున్నారన్నారు గీత కార్మికుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన వీరిని అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు మళ్ళీ ఇలాంటి వ్యవహారాలు చేస్తే గౌడ గీత కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు జిల్లాలో గీత కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అన్నారు ఈ కార్యక్రమంలో కల్లుగీతా కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మడ్డి అంజిబాబు జిల్లా ఉపాధ్యక్షులు గుణగంటి కృష్ణ జేరిపోతుల కృష్ణ జిల్లా కమిటీ సభ్యులు పాడిశెట్టి సైదులు అబ్బ గాని కాశయ్య బోడ సైదులు సిగ సత్యం తదితరులు పాల్గొన్నారు

## రాంపూర్ లో ఏఎస్ఐ ఆధ్వర్యంలో ఆవైర్నేస్ ప్రోగ్రాం.



కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని రాంపూర్ గ్రామంలో ఏ ఎస్సై సాదు లింబాద్రి ఆధ్వర్యంలో, సైబర్ క్రైమ్ నేరాలపై ట్రాఫిక్ నియంత్రణలపై, గ్రామ సర్పంచ్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ద్విచక్ర వాహనంపై రోడ్డు మీద వెళ్ళేటప్పుడు వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని లేనిచో ప్రాణానికి ప్రమాదమని తెలిపారు. మరియు సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎటువంటి ఫోన్ కాల్స్ వచ్చిన ఫోన్ ఎత్తకూడదని ఓటీపీ నంబర్ అడిగితే చెప్పకూడదు ఓటీపీ నెంబర్ చెప్తే డబ్బులు డ్రా చేసుకొని అకౌంట్ లో డబ్బులు డ్రా చేసుకుంటారని మరియు బ్యాంకులో నుంచి డబ్బులు డ్రా చేసి తీసుకొచ్చే సమయంలో ప్రజలు దొంగల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని కావున అపరిచితులు ఎవరైనా ఫోన్ చేసినా పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని వారు అన్నారు. కార్యక్రమంలో, పిట్లం మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు రాంపూర్ గ్రామ సర్పంచ్ నారాయణరెడ్డి, పోలీసులు బుచ్చయ్య చారి, ఓంకార్, మోయిన్, మరియు గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న కంటివెలుగు -2వ విడత కార్యక్రమం

### భారతదేశనికె ఆదర్శం అనిMPPఈదురు రాజేశ్వరి పెద్దవంగర గారు అన్నారు.



**తొర్రూర్ డివిజన్ :**

- గౌరవ సీఎం కేసీఆర్ గారు పేద ప్రజలకు దృష్టిలోపాలు ఉన్నవారికి కంటి పరీక్షలు చేయించి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి గారిదేనని తెలిపారు.
- ఈరోజు అవుతాపురం గ్రామంలో కంటి వెలుగు-2వ విడత ప్రోగ్రామ్ చివరి రోజునా %వీఞా% గారు ఆకస్మికంగా తనిఖీ చేసి,ఎంత మంది హాజరైనారు,ఎంత మందికి దృష్టిలోపం కారణంగా అద్దాలు పంపిణి చేసారని, రిజిస్టర్లను పరిశీలించారు. అంతకు ముందు ఆశా వర్కర్లు పూలబొకే %వీఞా% గారికి స్వాగతం పలికారు.
- అవుతాపురం గ్రామ%శీ%లో 1231 మంది కంటి పరీక్షలు చేయించుకోగా అందులో 137 మందికి కంటి అద్దాలు పంపిణి చేయడం జరిగింది. దూరదృష్టి ఉన్న 84మందికి కంటి అద్దాలు ఆర్డర్ పెట్టిరాని తెలిపారు. తరువాత ప్రోగ్రామ్ విజయవంతం ఐనందుకు టీమ్ అందరికి స్వీట్స్ పంపిణిని చేయడం జరిగింది. కంటి వెలుగు ప్రోగ్రామ్ విజయవంతం చేసినందుకు, డాక్టర్ లను, వారి టీమ్ ను గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రజలను అభినందించారు.
- అనంతరం ఈరోజు మహాత్మా గాంధీ గారి వర్ధంతి సందర్భంగా అవుతాపురం గ్రామపంచాయతీలో గాంధీ చిత్రపటానికి పూలదండ వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగిందని తెలిపారు. తరువాత ఎంపీపీ గారు మాట్లాడుతూ తెల్లదొరలకు వ్యతిరేకంగా పోరాడి అహింసా మార్గంలో నడిచే దేశానికి స్వతంత్రం తెచ్చిన మహనీయుడు గాంధీ గారిని కొనియాడారు. దేశ ప్రజలందరూ గాంధీ గారి ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు.
- తరువాత %వీఞా% గారు గౌరవ" శ్రీ ఎర్రబెల్లి దయాకర్ రావు రాష్ట్ర పంచాయతీ రాజ్ %ఒ=బౌ% శాఖ మంత్రి గారి సహకారంతో అవుతాపురం ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న మన ఊరు -మన బడి పనులను పరిశీలించారు.
- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నా ఈ కార్యక్రమం పనులను వెంటనే పూర్తి చేసి విద్యార్థులకు అందించాలని %ూజు% ని మరియు కాంట్రాక్టర్లకు సూచించారు.
- మండలంలో గౌరవ మంత్రి గారితో ఫిబ్రవరి 1వ తేదీన రెండు పాఠశాలలో ఓపెనింగ్ ప్రోగ్రాం చేయటం జరుగుతుందని తెలిపారు. పనుల విషయంలో నాణ్యమైన రీతిలో పనులు చేయించాలని కోరారు.
- తరువాత మధ్యాహ్న భోజనం వంటలను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం మెనూ ప్రకారం నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని వడ్డించాలని సూచించారు. అంతేకాకుండా ఎప్పటికప్పుడు స్థానిక సర్పంచ్ ఎంపీటీసీలు పర్యవేక్షించాలని కోరారు.
- ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సలీదండి మంజుల, వైస్ %వీఞా% బొమ్మెరాబోయిన కల్పన, డా. జాన్సీ, %వీఞా% సత్యనారాయణ, %ూజు% అశోక్,గ్రామ రైతు కోఆర్డినేటర్ పాకనాటి గోపాల్ రెడ్డి,మండల మహిళా సెల్ ఉపాధ్యక్షురాలు వెలపాటి రమదేవి, మండల ప్రచార కార్యదర్శి లింగాల రమేష్, మండల పార్టీ కార్యవర్గ సభ్యులు బెల్లంకొండా సోమనర్సయ్య,గ్రామ పార్టీ కార్యదర్శి చిలుకమార్తి సత్తయ్య, ఉపసర్పంచ్ బొమ్మెరాబోయిన దేవేంద్రకేశవులు, %దీ=ూ% నాయకులు బెల్లంకొండ యాకయ్య,గద్దల వెంకన్న,నోడల్ %ఎవీ% బిక్షపతి,%ూచీవీ% లు జోష్నా, ఈశ్వరి, %జజ% సుధాకర్ అంగన్వాడీ టీచర్లు వేముల సంధ్యారాణి, సునీత,ఆశా వర్కర్లు మద్దెల సరిత సామ్రాజ్యం, ఉపాధ్యాయులు,కంటి వెలుగు టీమ్ సభ్యులు, %ూ% సిబ్బంది తదితరులు పాల్గొన్నారు...

## నీటి సమస్య తలెత్తకుండా చూస్తాం......

- మునిసిపల్ కమీషనర్ సింగారపు కుమార్



**తొర్రూర్ డివిజన్** :పురపాలికలో నీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ సింగారపు కుమార్అన్నారు.
సోమవారం పట్టణంలోని 16వ వార్డు. 9వ వార్డు నందు గత కొద్ది రోజులుగా వాటర్ సమస్య ఉన్న ఫిర్యాదు మేరకు వాటర్ మెన్స్ తోటి వార్డ్ యందు కలియ తిరుగుతూ పరిష్కారం చూపిస్తానని హామీ ఇవ్వడం జరిగింది.
ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... వచ్చే ఏప్రిల్, మే, జూన్ నెలలో వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పురపాలిక పరిధిలో నీటి ఎద్దడి సమస్య లేకుండా రానున్న మూడునెలల్లో వార్డుల వారీగా ప్రణాళిక రూపొందించుకుని త్రాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో లీకేజీ అవుతున్న తాగునీటి పైపులైన్లను గుర్తించడం వాటికి తక్షణమే మరమ్మతులు చేయడంతో పాటు వాల్వ్ ద్వారా నీటి వృథాను అరికట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. దీంతో చాలావరకు తాగునీటి వృథాను అరికట్టవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి ఒక నల్ల మాత్రమే ఉండాలని కొందరు నల్ల వస్తున్నప్పుడు డైరెక్ట్ మోటర్ పెడుతున్నారని కార్యాలయం దృష్టికి వచ్చినందున అలాంటి వారిపై జరిమానాలు విధించబడతాయని అన్నారు.
వేసవిలో నీటిని పొదుపుగా వాడుకోగలిగితే పౌరులు నీటి కష్టాలకు దూరంగా ఉండవచ్చని తెలిపారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ రంజిత్. కౌన్సిలర్లు కొలుపుల శంకర్, వాటర్ మెన్స్ తదితరులు పాల్గొన్నారు

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదప్రజలకు ఒక వరం

- ప్రతి ఇంటికి సంక్షేమమే అందించాలనే లక్ష్యంగా పనిచేస్తున్నది తెలంగాణ ప్రభుత్వం
- BRS మండల పార్టీ అధ్యక్షులు ఈదురు ఐలయ్య పెద్దవంగర గారు తెలిపారు.

**తొర్రూర్ డివిజన్ :**



- ఈరోజు BRS మండల పార్టీ కార్యాలయంలో గౌరవ"శ్రీ ఎర్రబెల్లి దయాకర్ రావు రాష్ట్ర పంచాయతీ రాజ్ %ఒ=బౌ% శాఖ మంత్రి గారి సహకారంతో పడమటి తండా తండాకు చెందిన ధరవత్ దేవేందర్ 20వేల రూపాయలు, ధరవత్ వంశీ s/o దేవేందర్ కు 60వేల రూపాయలు మరియు పోచంపల్లి గ్రామానికి చెందిన అలకుంట్ల కొమురయ్య కు 37వేల 500 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణి చేయడం జరిగిందని అన్నారు.
- ఈ మూడు చెక్కుల మొత్తం 1లక్ష 17వేల 500 రూపాయలు అని తెలిపారు.
- ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్,మండల పార్టీ ఉపాధ్యక్షులు కనుకుంట్ల వెంకన్న, పడమటి తండా సర్పంచ్ ధరవత్ రాజేందర్, మండల అధికార ప్రతినిధి బానోత్ సోమన్న, పడమటి తండా పార్టీ అధ్యక్షురాలు ధరవత్ బుజ్జమ్మ, రైతు కోఆర్డినేటర్ పాకనాటి ఉపేందర్ రెడ్డి, చిన్నావంగరా గ్రామ పార్టీ అధ్యక్షులు కొండపల్లి విజయపాల్ రెడ్డి,పోచంపల్లి మాజీ సర్పంచ్ శివరాత్రి ఉప్పలయ్య,పడమటి తండా యూత్ అధ్యక్షులు బానోత్ మైబు, కోరిపల్లి చైర్మన్ .యాకుబ్, యూత్ నాయకులు ధరవత్ బాలు, రాజు తదితరులు పాల్గొన్నారు...

**రాంపూర్ లో ఏఎస్ఐ ఆధ్వర్యంలో ఆవైర్నేస్ ప్రోగ్రాం.**

కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని రాంపూర్ గ్రామంలో ఏ ఎస్సై సాదు లింబాద్రి ఆధ్వర్యంలో, సైబర్ క్రైమ్ నేరాలపై ట్రాఫిక్ నియంత్రణలపై, గ్రామ సర్పంచ్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ద్విచక్ర వాహనంపై రోడ్డు మీద వెళ్ళేటప్పుడు వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని లేనిచో ప్రాణానికి ప్రమాదమని తెలిపారు. మరియు సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎటువంటి ఫోన్ కాల్స్ వచ్చిన ఫోన్ ఎత్తకూడదని ఓటీపీ నంబర్ అడిగితే చెప్పకూడదు ఓటీపీ నెంబర్ చెప్తే డబ్బులు డ్రా చేసుకొని అకౌంట్ లో డబ్బులు డ్రా చేసుకుంటారని మరియు బ్యాంకులో నుంచి డబ్బులు డ్రా చేసి తీసుకొచ్చే సమయంలో ప్రజలు దొంగల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని కావున అపరిచితులు ఎవరైనా ఫోన్ చేసినా పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని వారు అన్నారు. కార్యక్రమంలో, పిట్లం మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు రాంపూర్ గ్రామ సర్పంచ్ నారాయణరెడ్డి, పోలీసులు బుచ్చయ్య చారి, ఓంకార్, మోయిన్, మరియు గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

శుభ తెలంగాణ RNI-TELTEL/2017/72695
ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక
మంగళవారం | మేడ్చల్
31 జనవరి 2023
www.subhatelangana.in



# సిపిఎంలో వివిధ పార్టీల నుండి చేరికలు.....





- సిపిఎం పార్టీ ప్రజా పోరాటాలకు ఆకర్షితులై సిపిఎం లో 25 కుటుంబాలు చేరికలు
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్...

**తొర్రూర్ డివిజన్ :** సిపిఎం పార్టీ పోరాటాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుండి సిపిఎం పార్టీలో కొమ్మనపల్లి తండా గ్రామ పంచాయతీకి చెందిన కపూర్య తండాకు చెందిన 25 కుటుంబాల ప్రజలు సీపీఎం పార్టీలో చేరారు. సోమవారం తొర్రూర్ సిపిఎం మండలం కమిటీ ఆధ్వర్యంలో కొమ్మనపల్లి తండా గ్రామపంచాయతీ పరిధిలోని కపూర్య తండా ప్రజలందరిని సిపిఎం పార్టీ లో కి పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మండల కార్యదర్శి ఎండి యాకుబ్ అధ్యక్షతన సమావేశంలో సాధుల శ్రీనివాస్ మాట్లాడుతూ తొర్రూరు మండల కేంద్రానికి అతి దగ్గరలో ఉన్న కపూర్య తండా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని, కనీసం సౌకర్యాలు లేవని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో సౌకర్యాలు ఉండాల్సిన ఈ రోజుల్లో కూడా కపూర్య తండాకు రోడ్డు సౌకర్యం లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. రోడ్డు సౌకర్యం లేక వైద్య కోసం వచ్చేసరికి ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని అన్నారు. అయినా కూడా ఈ గ్రామ వాసులను ఈ పాలక వర్గాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమని ఆయన అన్నారు. ఇప్పటివరకు గ్రామంలో ఒక్కరికి కూడా ఉపాధి హామీ కార్డు లేకపోవడం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన ఎద్దేవా చేశారు. రేషన్ బియ్యం కోసం కిలోమీటర్ల దూరం నడిచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి, ఏజెన్సీలో ఎలా అయితే ఉందో ఈ తండా పరిస్థితి కూడా అలా ఉందని దీనిని వెంటనే పాలకులు పట్టించుకోని అన్ని వసతులు తండావాసులకు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. తండకు సరైన రోడ్డు మార్గం లేక, సరైన టైమ్ కు వైద్యం అందకపోవడం వల్ల గతంలో చాలామంది చనిపోవడం జరిగిందని ఈ పరిస్థితి ఏజెన్సీ ప్రాంతంలో కూడా లేదని... కావున ఇక్కడ పాలకులు వెంటనే స్పందించి ఈ తండా వాసుల సమస్యలు పరిష్కరించాలని లేనియెడల వారందరినీ కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలని హెచ్చరించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్, కొత్త వెంకట్ రెడ్డి, డోనక దర్గయ్య, ధరావత్ యాకన్న, సోమ్లా, ధరావత్ పెద్ద వెంకన్న, దేవుల, ధరావత్ మోతి, ధరావత్ రవి, భోకిని, భూక్య వెంకన్న, వెంకన్న ధరావత్, లక్ష్మి ,సీతమ్మ, శీను, బాలు, సుమన్, ధరావత్ స్వామి, అమ్మాపురం గ్రామానికి సంబంధించిన నాయకులు మద్దెల సంతోష్ లు పార్టీలో చేరారు. సిపిఎం పార్టీలో ఈ ఒక్క తండ ప్రజలే కాదు రాష్ట్రంలో అందరూ ఎర్రజెండా నీడలోకి రావాల్సిందేనని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఎర్రజెండ పార్టీ నీడలోనే సమస్యల పరిష్కారం సాధ్యపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నా నాయకులు మార్గ సాంబయ్య జితేందర్ రెడ్డి బోరస్వామి సారయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఏసిడి ఛార్జీలను వెంటనే రద్దు చేయాలి




**తొర్రూర్ డివిజన్ :** రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులపై రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలతో పాటుగా ముందస్తు వినియోగ దారుల డిపాజిట్ (ఏసిడి) ఛార్జీల పేరుతో ప్రజలపై అధనపు భారం మోపుతున్నదని వెంటనే ఆ ఏసిడి ఛార్జీలను వెంటనే రద్దు చేయాలని అఖిలభారత రైతు సంఘం( ఏఐకేఎంఎస్) జిల్లా కోశాధికారి ఆలకుంట్ల సాయన్న డిమాండ్ చేశారు. డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సబ్ స్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధ్య తరగతి ప్రజలపై అదనపు కరెంటు బిల్లు వేయడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఉచిత కరెంటు అని అధికారంలోకి వచ్చిన కేసీఆర్ తీరా గద్దెనెక్కిన తర్వాత నుంచి ప్రజలపై ఇబ్బడిముబ్బడిగా కరెంట్ ఛార్జీలు పెంచి ప్రజలను మోసం చేశారని తెలిపారు. ఇప్పటి వరకూ ఏడు సార్లు విద్యుత్ ఛార్జీల ను పెంచి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం మోపి సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కేసీఆర్ అవినీతి పాలన నిరంకుశ పాలన వల్ల ప్రజలు తీవ్ర ఆర్థిక భారంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి పెంచిన విద్యుత్ ఛార్జీల ను తగ్గించాలని,ఏసిడి ఛార్జీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు ఉడుగుల లింగన్న, కార్యదర్శి జాటోత్ బిక్షపతి, నాయకులు చిర్ర యాకయ్య, ధరావత్ దేవా,బానోత్ సర్వన్, డోనుక ఎల్లయ్య,కొమరయ్య, మైసయ్య,మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## బిసి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జాతి పిత వర్ధంతి



**తొర్రూర్ డివిజన్ :** తొర్రూర్ మున్సిపాలిటీ కేంద్రము స్థానిక పట్టణ మహాత్మ గాంధీ కూడలి లోని గాంధీ విగ్రహం వద్ద ఈ రోజు మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా తోరూర్ పట్టణంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం తొర్రూరు మండల ప్రధాన కార్యదర్శి మార్క రుద్రయ్య ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా,నివాళులర్పించారు. కార్యక్రమం లో తొర్రూర్ మున్సిపాలిటీ బిసి సంఘం అధ్యక్షుడు వన్నాల సాగర్ జిల్లా కార్యదర్శి బైరు లక్ష్మీనారాయణ జిల్లా సహాయ కార్యదర్శి మాచర్ల.శ్రీనివాస్ గౌడ్ యువజన జిల్లా కార్యదర్శి కొండ్లె ఉమేష్ మండల సహాయ కార్యదర్శి చింతనూరి రమేష్ మండల ఉపాధ్యక్షుడు మార్గం ఉపేందర్ సభ్యులు తుమ్మ నరేష్ వేముల సాగర్ అంకం సురేష్ జంజీరాల మనోహర్ చందరాజు పెండెం ప్రేమ్ కుమార్ పొట్ట బత్తిని రమేష్ సగర భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు బైసా రమేష్ ఉపాధ్యక్షుడు సోమ హరిప్రసాద్ ప్రధాన కార్యదర్శి రుద్రయ్య,కోశాధికారి వేముల.మురళి,మార్క.సాంబయ్య,బి.సి,సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన అష్టాదశ(18వ ) వార్షిక బ్రహ్మోత్సవములో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ





షేక్ పేట్ ఓ.యు కాలనీ లో గల విశాఖ శ్రీ శారదా పీఠ పాలిత శ్రీ భూసమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన అష్టాదశ(18వ ) వార్షిక బ్రహ్మోత్సవముల కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ. ఈ కార్యక్రమంలో మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ , అన్నే శ్రీనివాస రావు, కృష్ణం రాజు తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి పూర్వవిద్యార్థుల చేయూత



**మహబూబాబాద్ జిల్లా బయ్యారం:..** బయ్యారం మండల కేంద్రంలోని ముస్తఫానగర్ కి చెందిన షేక్. సోందు, 40 సంవత్సరాలు ఇటీవల అకాల మరణం చెందడం జరిగింది. అతనికి ఒక పాప, ఒక బాబు వున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో పిల్లల చదువులు, పోషణ తల్లికి భారం అవుతుండటం, కనీసం ఉండటానికి ఇల్లు కూడా లేని దయనీయ స్థితిలో ఆ కుటుంబం ఉన్నది. చిన్నతనంలో తమతో కలిసి చదువుకున్న (1998-99 జడ్పీ హెచ్ఎస్ బయ్యారం) తోటి స్నేహితుడి కుటుంబ పరిస్థితి ని తెలుసుకొని తమవంతు బాధ్యతగా మిత్రులు అందరూ కలిసి సోందు పిల్లల చదువుల నిమిత్తం 31000/- రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ప్రభుత్వం కూడా ఆ కుటుంబానికి బాసటగా ఉండి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి మిత్రబృందం, సుమన్ రెడ్డి, ఖాసీం, ఉపేందర్, ఢిల్లీ రాజ్ పాల్గొన్నారు.

## ప్రజా జ్యోతి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజా జ్యోతి 2023 నూతన క్యాలెండర్ ను సోమవారం ఎస్సై నర్సింగ వెంకన్న స్థానిక విలేఖరి శరత్ మరియు పోలీస్ సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పత్రికలు వ్యవహరించాలని సూచించారు. నిజాన్ని నిర్భయంగా రాసే ప్రజా జ్యోతి దినపత్రిక వార్తల ను తాను ప్రతి రోజు చదువుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జందార్ మల్లయ్య, సతీష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# కంటి వెలుగుతోనే అంధత్వ నివారణ

## మున్సిపల్ 2వ వార్డు కౌన్సిలర్ రోజా



**తొర్రూర్ డివిజన్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగుతోనే అంధత్వ నివారణ అవుతుందని,దీనిని సద్వినియోగం చేసుకోవాలని తొర్రూరు మున్సిపల్ 2వ వార్డు కౌన్సిలర్ తూనం రోజా ప్రభుదాస్ అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని 2వ వార్డులో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమంపై స్థానికులకు కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేత్ర సమస్యలతో బాధపడుతున్న రోగులను పరీక్షించి ఉచితంగా మందులు,అద్దాలు అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. నేత్ర సమస్యలతో ఎవరు ఇబ్బందులు పడవద్దనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని,ఇది పేదలకు వరమని తెలిపారు,పట్టణంలోని ఆరోగ్య ఉప కేంద్రంలో నిర్వహించే కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరు ఆధార్ కార్డు లేదా రేషన్ కార్డు తీసుకొని ఉచితంగా కంటి పరీక్ష చేయించుకొని కంటి పరీక్ష అద్దాలను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు స్పెషల్ ఆఫీసర్ కనకరాజు, వార్డు అభివృద్ధి కమిటీ సభ్యులు నల్లపు రాజు,అంగన్వాడి టీచర్ టి. ప్రమీల,ఆశ వర్కర్లు రేణుక, అరుణ, హేమలత, శ్రీలత,సునీత,ఆర్పీలు స్రవంతి, అనిత తదితరులు పాల్గొన్నారు.

## గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధించే దిశగా కేసీఆర్ పాలన





- గాంధీజీ వర్ధంతి సంధర్భంగా ఆమహనీయునికి ఘన నివాళి
- చిన్నతూండ్లలో సంక్షేమ, అభివృద్ధి పనుల కోసం సుమారు 9.92కోట్లు ఖర్చు
- ఎమ్మెల్యేతో మాట్లాడి అభివృద్ధి పనులు చేయిస్తానని హామీ..
- వెటర్నరీ డాక్టర్ వారంలో 3 రోజులు ఉండేలా చర్యలు
- కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం,** యాచారం మండలం చిన్నతూండ్ల గ్రామంలో సోమవారం రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి మహత్మ గాంధీజీ గారి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం చిన్నతూండ్ల గ్రామ చౌరస్తాలో ప్రజలను ఉద్దేశించి మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..గ్రామంలోని నేను ఓట్ల కోసం పాదయాత్ర చేస్తున్నానని మీరు అనుకోవచ్చు కానీ, నేను ఓట్ల కోసం రాలేదు. ఇప్పుడు ఎన్నికలు లేవు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించటానికి.. అదేవిధంగా ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకోవటానికే వచ్చానారు. గ్రామంలో డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనుల కోసం అదేవిధంగా నూతన ముదిరాజు సంఘ భవనం, యాదవ సంఘ భవనం, ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేయాలని సంఘాల నాయకులు కోరగా.. తక్షణమే ఎమ్మెల్యే తో మాట్లాడి నిర్మాణాలను పూర్తి చేయిస్తానని తెలిపారు.

వెటర్నరీ ఆస్పత్రిలో డాక్టర్ వారానికి 3 రోజులు అందుబాటులో ఉండేవిధంగా ఎమ్మెల్యే కిషన్రెడ్డి తో మాట్లాడి వెటర్నరీ డాక్టర్ను ఏర్పాటు చేస్తానని అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు భోజనం చేయటానికి సుమారు 100స్టీల్ ప్లేట్లను ఎంకేఆర్ ఫౌండేషన్ ద్వారా అందజేస్తామని, క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు విద్యార్థులకు వాలీబాల్ కిట్, అదేవిధంగా యువకులకు క్రికెట్ కిట్ ను అందజేశారు. గ్రామంలో కంటివెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కేంద్రాన్ని సందర్శించి ఆప్రక్రియను పరిశీలించి డాక్టర్లతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరు సద్వినియోగం చేసుకొని కళ్లద్దాలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చిన్నోళ్ల జంగమ్మ యాదయ్య, పార్టీ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్ గౌడ్ , పిఎసిఎస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, సర్పంచ్ సబిత ఆంజనేయులు, మాజీ సర్పంచ్ సత్యపాల్, గ్రామశాఖ అధ్యక్షుడు అంకని రమేష్, ప్రధాన కార్యదర్శి శంకర్,వార్డుమెంబర్లు, పీఏసీఎస్ డైరెక్టర్ స్వరూప, శశికళ, కొత్తపల్లి ఎంపీటీసీ సుమతమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టరు తల్లారి మల్లేష్, రాజశేఖర్ రెడ్డి, ఆనంద్, నంది వనపర్తి ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కృష్ణమూర్తి నాయకులు రాజునాయక్, ఓరుగంటి యాదయ్యగౌడ్ ,బీవైఎఫ్ సభ్యులు పాల్గోన్నారు..





## ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు పరిష్కరించినందుకు జిల్లా అదనపు కలెక్టర్ కు మరియు అధికారులకు మిఠాయిలు పంపిణీ చేసిన సోమయ్య



రెండు ఎకరాల భూమి దక్కినందుకు జిల్లా అదనపు కలెక్టర్ కు అభినందనలు తెలిపిన జలగం సోమయ్య తుంగతుర్తి లో తన రెండు ఎకరాల భూమిలో వ్యవసాయం సాగు చేసుకుంటున్న భూమికి పట్టా పుస్తకం రాకపోవడంతో, అట్టి వివరాలతో కూడిన దరఖాస్తును సోమవారం కలెక్టరేట్లో జరిగే ప్రజావాణి కార్యక్రమంలో సోమయ్య దరఖాస్తు చేసుకున్నాడు, మండల కార్యాలయంలో ఎన్నిసార్లు తెలిపిన పని జరగలేదని ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్న వెంటనే జిల్లా కలెక్టర్ విచారణ జరిపి తనకు తెలంగాణ ప్రభుత్వ పట్టా పుస్తకాన్ని అందజేశారని తన సంతోషాన్ని వెలబుచ్చారు. ఈరోజు జరిగిన ప్రజావాణిలో జలగం సోమయ్య వచ్చి అదనపు కలెక్టర్, జిల్లా అధికారులకు మిఠాయిలు పంచిపెట్టాడు. ప్రజల సమస్యలకు ప్రతి సోమవారం కలెక్టరేట్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉందని సోమయ్య సంతోషం వ్యక్తం చేశాడు.

## రాంపూర్ లో ఏఎస్ఐ ఆధ్వర్యంలో ఆవైర్నేస్ ప్రోగ్రాం.




కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని రాంపూర్ గ్రామంలో ఏ ఎస్సై సాదు లింబాద్రి ఆధ్వర్యంలో, అవేర్నెస్ సైబర్ నేరాలపై రోడ్డు భద్రతలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనంపై రోడ్డు మీద వెళ్ళేటప్పుడు వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని లేనిచో ప్రాణానికి ప్రమాదమని తెలిపారు మరియు సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎటువంటి ఫోన్ కాల్స్ వచ్చిన వారికి ఓటిపి నంబరు చెప్పినా మోసపోతామని డబ్బులు డ్రా చేసుకుంటారని కావున అపరిచితులు ఎవరైనా ఫోన్ చేసినా సమాచారం అందించాలని చేసిన ఎత్తకూడదని కావున ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని మోసపోకూడదని వారు సూచించారు. కార్యక్రమంలో, పిట్లం మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు రాంపూర్ గ్రామ సర్పంచ్ నారాయణరెడ్డి, పోలీసులు బుచ్చయ్య చారి, ఓంకార్, మోయిన్, మరియు గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published & Owned by Sri N.C. Shekar.Corporate Office : Rama Krishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India.RNI-TELTEL/2017/72695,Editor :N.C.Shekar.Cell :7799911110.Email:subhatelangana@gmail. com